నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 10 మార్చి 2025 | VIKARABAD

## విగ్రహానికి ప్రత్యేక పూజలు

సీసీ రోడ్డు పనుల కోసం తవ్వకాలు జరుపుతున్న సమయంలో ఆదివారం పురాతన విగ్రహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. సీసీ రోడ్డు వేసేందుకు గుంతలుగా ఉన్న మట్టిరోడ్డును జేసీబీతో చదును చేస్తుండగా ఎన్కేపల్లి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో రోడ్డుపై పురాతన విగ్రహం లభ్యం కావడం తో గ్రామస్తులు దానికి జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కొందరు గ్రామదేవత విగ్రహమని.. మరికొందరు ఆంజనేయస్వామి ప్రతిరూపమని పేర్కొంటున్నారు.

-బొంరాస్‌పేట, మార్చి 9

యాచారం మండలంలోని మేడిపల్లిలో ఎండిపోయిన పెద్ద చెరువు

# సంక్షేమం కరువైన హాస్టళ్లు

## వసతి గృహాల్లో వరుసగా ఘటనలు జరుగుతున్నా పట్టని పాలకులు

- వికారాబాద్ జిల్లా నవాబుపేటలోని కేజీబీవీలో 8 మంది విద్యార్థినులను కరిచిన ఎలుకలు
- కొత్తగడి గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయినుల వేధింపులతో పాఠశాల భవనం పై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
- ఈ ఘటనపై బీసీ కమిషన్ సీరియస్
- విచారించి నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం

వికారాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం సంక్షోభంలో కూరుకుపోయింది. సబ్బండ వర్ణాలను గాలికి వదిలేసింది. ముఖ్యంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన గురుకులాలపై రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తల్లిదండ్రులు అడ్మిషన్ల కోసం గురుకుల పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు చేసిన పరిస్థితుల నుంచి.. ప్రస్తుతం గురుకులాలు అంటేనే హడలిపోయి పరిస్థితి నెలకొన్నది. తాము ఆ పాఠశాలల్లో చదుకోబోమని.. అక్కడ పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు అక్కడికెళ్లేందుకు ఇష్టపడడం లేదు. కేసీఆర్.. 200 గురుకులాలను వెయ్యి గురుకులాలకు పెంచి.. వాటిలో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించి.. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయగా.. 15 నెలలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో ఏదో ఒక ఘటన జరుగుతున్నా పాలకులు మాత్రం మొద్దు నిద్రను వీడకపోవడం శోచనీయం. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఫుడ్ పాయిజన్, ఎలుకలు, పాముకాటు ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వ సమీక్షించుకోకపోవడంతోపాటు పర్యవేక్షణను గాలికి వదిలేసింది.

కొత్తగడి గురుకుల పాఠశాల

విరిగిన కాలుతో విద్యార్థిని తబిత(ఫైల్)

### ఉపాధ్యాయినుల వేధింపులు భరించలేక..

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయినుల వేధింపులు తాళలేక పదోతరగతి విద్యార్థిని పాఠశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. గతంలో విద్యార్థిని తల్లిదండ్రులతో జరిగిన గొడవను మనసులో పెట్టుకొన్న ఉపాధ్యాయినులు విద్యార్థినిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. అంతేకాకుండా విద్యార్థిని ప్రవర్తనపైనా చెడుగా ప్రచారం చేయడంతో తట్టుకోలేకపోయిన విద్యార్థిని తబిత ఫిబ్రవరి 24న స్కూల్ భవనం పై నుంచి కిందికి దూకడంతో ఆమె కాలు విరిగింది. తబిత కాలు జారి పడిందంటూ ఆమె తల్లిదండ్రులకు గురుకుల పాఠశాల సిబ్బంది ఫోన్ చేయడంతో ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఉపాధ్యాయుల వేధింపులతోనే పాఠశాల భవనం పై నుంచి విద్యార్థిని దూకిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆగ్రహం చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టి, టీచర్లను నిలదీశారు. తబితను వేధించిన ఉపాధ్యాయినులను వెంటనే సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. మరోవైపు ఈ ఘటనపై బీసీ కమిషన్ సీరియస్ అయ్యింది. పది రోజుల్లోగా విచారించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌తోపాటు గురుకుల పాఠశాలల కార్యదర్శిని ఆదేశించింది. రాష్ట్రంలో తరచూ ఉపాధ్యాయులు వేధిస్తున్నారని విద్యార్థులు ఆత్మహత్యాయత్నం ఘటనలు జరగడం ఆందోళనకరమని, దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది.

### నవాబుపేట కేజీబీవీలో..ఎలుకలు కరిచి 8 మంది విద్యార్థినులకు గాయాలు

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ వసతి గృహాలు, కేజీబీవీలు, గురుకులాల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించడంతోపాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షించగా.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగినా తూతూ మంత్రంగా దిద్దుబాటు చర్యలు చేపట్టి చేతులు దులుపుకొన్నదే తప్పా హాస్టళ్ల సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోలేదు. దీంతో హాస్టళ్లలో పాముకాటు, ఎలుకలు కరవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల నవాబుపేట మండల కేంద్రంలోని కేబీబీవీలో విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. గతనెల 24న నలుగురు, 27న మరో నలుగురు విద్యార్థినులను ఎలుకలు కరువడంతో కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో వారిని ప్రభుత్వ దవాఖానకు అక్కడి సిబ్బంది తీసుకెళ్లారు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసి ఆందోళన చేపట్టడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. అయితే మొదట ఎలుకలు కరిచినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే మరోసారి ఘటన జరిగింది. అయితే ప్రభుత్వ వసతిగృహాల్లో పారిశుధ్యం లోపించడంతోనే పెద్ద సంఖ్యలో ఎలుకలు కేజీబీవీలోకి వస్తున్నట్లు విద్యార్థినులు చెబుతున్నారు. అపరిశుభ్రంతో ఎలుకలు, ఇతర విష పురుగులతో ఏ ప్రమాదం పొంచి ఉందోనని హాస్టళ్లలో భయం భయంగా గడుపుతున్నామని స్టూడెంట్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళనతో డీఈవో కేజీబీవీని సందర్శించి వెళ్లిన అనంతరం సిబ్బంది దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం తర్వాత అధ్వానంగా మారిన హాస్టల్ గదులను శుభ్రం చేసే పని చేపట్టారు.

నవాబుపేట కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహంలో ఎలుకలు కరిచిన నేపథ్యంలో విద్యార్థినుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ (ఫైల్)

# ఎండిన చెరువు.. మత్స్యకారుల దిగులు

**తమను ఆదుకోకుంటే రోడ్డున పడుతామంటున్న మత్స్యకారులు**

- చెరువుల్లో నీళ్లు లేకపోవడంతో చేపపిల్లలను వదిలేందుకు సుముఖత వ్యక్తం చేయని సర్కారు
- వర్షాభావ పరిస్థితులతో రంగారెడ్డి జిల్లాలో ఎండుతున్న చెరువులు
- జిల్లాలో 982 చెరువులుండగా.. ఇప్పటికే 80శాతానికిపైగా ఎండిపోయిన తటాకాలు
- జిల్లాలోని 196 సొసైటీల్లో సుమారు 10 వేల మందికి పైగా సభ్యులు

రంగారెడ్డి, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో చెరువులు ఎండిపోతున్నాయి. గత కేసీఆర్ హయాం లో చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు వాటికి నీరందించే ప్రధాన కాల్వలకూ మరమ్మతులు చేయగా రెం డేండ్ల కిందట కురిసిన వానలకు చెరువులు, కుంటలు నిండాయి. ఆ తర్వా త ఆశించిన మేర వర్షాలు కురియకపోవడంతో చెరువులు, కుంటలకు నీరురాక ఎండుముఖం పట్టాయి. గతేడాది చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో కేవలం యాభైశాతం చేప పిల్లలను మాత్రమే రేవంత్ ప్రభుత్వం పం పిణీ చేసింది. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో 1.20 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయగా.. రేవంత్ సర్కార్ 59 లక్షల చేపపిల్లలను పంపిణీ చేసిం ది. ఈ ఏడాది చెరువుల్లో నీరు లేకపోవడంతో వాటిని కూడా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు మత్స్యశాఖను నిధుల కొరత వేధిస్తుండడంతో ఈ ఏటా చేప పిల్లలను పంపిణీచేసే అవకాశాలు లేనట్లేనని తెలుస్తున్నది. చెరువులు ఎండిపోవడంతో వా టిపై ఆధారపడిన మత్స్యకారులు ఉపాధికి దూరమయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో 196 సొసైటీ ల్లో 10 వేల మందికి పైగా సభ్యులున్నారు.

### మూతపడిన చేప పిల్లల పెంపకం కేంద్రం..

ఇబ్రహీంపట్నం పెద్దచెరువు సమీపంలో గతంలో చేపపిల్లల పెంపక కేంద్రం ఉండేది. ఇక్కడే చేప పిల్లలను పెంచి జిల్లాలోని చెరువులకు సరఫరా చేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పెంపక కేంద్రం మూతపడింది. చేపపిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన నీటితొట్లూ ఎండిపోయాయి. ఈ కేంద్రంలో చేపపిల్లలను పెంచడంతోపాటు మత్స్యకార సహకార సంఘాల వారికి శిక్షణ కూడా ఇచ్చేది. నిధుల కొరతతో ప్రభుత్వం దీనిని మూసేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం సెగ్మెంట్ పరిధిలోని మత్స్యకారులు చేపలను తీసుకొచ్చి విక్రయించేందుకు వీలుగా ఇబ్రహీంపట్నంలోని చేపపిల్లల పెంపక కేంద్రం వద్ద ఫిష్‌మార్కెట్ ఏర్పాటుకు సకల్పంచి రూ.2 కోట్లను మంజూరు చేసింది. అయితే, ప్రభుత్వం మారడంతో చేపల మార్కెట్ ఊసే ఎత్తడంలేదు. మంజూరైన నిధులు కూడా దారి మళ్లినట్లు ఆరోపణలున్నాయి.

### జిల్లాలో 982 చెరువులు..

జిల్లాలో 982 చెరువులున్నాయి. వాటిలో ఇబ్రహీంపట్నం పెద్దచెరువు, యాచారం మండలంలోని లక్ష్మణ్‌చెరువు, మంచాల మండలం, లింగంపల్లిలోని సాబిత్‌నగర్ చెరువుతోపాటు మరో పది పెద్దచెరువులు ఉన్నాయి. ఈ తటాకాల్లో మాత్రమే నీరు నిల్వ ఉండగా.. మిగిలిన చెరువుల్లో 80 శాతానికిపైగా ఎండిపోయాయి. చెరువులు ఎండిపోతుండడంతో చేపలు పట్టుకుని ఉపాధి పొందే మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు చెరువుల్లో 60 శాతం నీరుంటేనే చేపపిల్లలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నది. కాగా, రావిర్యాల, ఇబ్రహీంపట్నం, మాసాబ్‌చెరువు వంటి వాటిలో 60 శాతం కూడా నీళ్లులేవు.. దీంతో ఆ చెరువుల్లో చేప పిల్లలను వదిలే పరిస్థితి లేదని తెలుస్తున్నది. కేసీఆర్ హయాంలో చెరువులన్నీ నిండుకుండల్లా ఉండడంతో పెద్ద ఎత్తున చేప పిల్లలను తటాకాల్లో వదిలారు. ఏ గ్రామంలో చూసినా చేపలను రాశులుగా పోసి అమ్మేవారు.

ఇబ్రహీంపట్నంలో మూతపడిన చేపపిల్లల పెంపక కేంద్రం

### చెరువుల్లో నీళ్లుంటేనే మత్స్యకారులకు ఉపాధి

చెరువుల్లో నీరుంటేనే మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుంది. తటాకాల్లో నీరు లేకపోవడంతో ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న లక్షలాది మంది రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తమకు ఉపాధి కల్పించడంతోపాటు.. ఇబ్రహీంపట్నంలో ఉన్న చేపపిల్లల పెంపకం కేంద్రాన్ని పునరుద్ధరించి మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలి.

-గుంటి కిరణ్, మత్స్య సహకార సంఘం సభ్యుడు

### చెరువుల్లో బోరుబావులు తవ్వించి ఉపాధి కల్పించాలి

చెరువులు, కుంటలు ఎండిపోతుండడంతో మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతున్నది. గతంలో చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడంతో చేపలను విక్రయించి ఉపాధిని పొందాం. ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో బోరుబావులు తవ్వించి మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలి.

-నర్సింహ, మత్స్యకారుల సంఘం నాయకుడు

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌ను నగర ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో జనాలు టీవీలకు అతుక్కుపోయారు. మరోవైపు బన్సీలాల్‌పేట్‌లో బండారి శ్రీనివాస్ తన కుమార్తె వివాహ వేడుక జరుగుతున్న కల్యాణ మండపంలో క్రికెట్ మ్యాచ్ లైవ్ ప్రసారాన్ని చూసేందుకు ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేశారు. దీంతో పెండ్లికి వచ్చిన బంధువులు వధూవరులను ఆశీర్వదించడంతో పాటు క్రికెట్ మ్యాచ్ చూస్తూ అక్కడే కూర్చున్నారు.

-సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట

# కండువాలు కప్పి.. పార్టీలోకి ఆహ్వానించి..

**మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బండరావిరాల వాసులు**

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 9 : డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రధాన అనుచరుడు విజయ్‌కుమార్, పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బండరావిరాల గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తిగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు గుండ్ల జంగయ్యయాదవ్, దానేశ్, దయాకర్ రెడ్డి, అర్జున్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మణ్, యాదగిరి, సుబ్బారావు, రవి, శ్రీరాం, కుమార్, నరేశ్, రమేశ్ రాజు, పృథ్వీ, శివశంకర్, భరత్, బస్వరాజ్, మల్లేశ్, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.



మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బండరావిరాల వాసులు

# మ్యూల్ ఖాతాలతో కొత్త పన్నాగం..

**ఎక్కువగా ప్రైవేటు బ్యాంకుల అకౌంట్లే ఉపయోగిస్తున్న సైబర్ నేరగాళ్లు**

**డేటా ప్రొటెక్షన్ యాక్ట్ లేకపోవడంతో మరింత రెచ్చిపోతున్న వైనం**

III లో

అమాయకుల దోచేస్తున్న సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేయడానికి సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలే కీలకంగా మారాయి. కాజేసిన సొమ్మును పలు బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసి, అవకాశం ఉన్నచోట విత్ డ్రా చేసుకుంటున్నారు. అలాకాకపోతే ఆన్‌లైన్‌లో కూపన్ల కొనుగోలు, క్రిప్టో కరెన్సీలోకి మార్చి విదేశాలకు పంపుతున్నారు. అయితే ఈ అకౌంట్స్ కోసం ఎక్కువగా ప్రైవేటు బ్యాంకులకు చెందిన అకౌంట్స్‌నే వాడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సుమారు 62 శాతం లావాదేవీలు ఈ అకౌంట్స్ లోనే చేస్తున్నారని వారు పేర్కొన్నారు. బ్యాంకులు పర్సనల్ వెరిఫికేషన్ లేకుండా కరెంట్ ఖాతాను తెరుస్తుండడంతో సైబర్ నేరగాళ్లకు అనుకూలమవుతోంది. డేటా ప్రొటెక్షన్ యాక్ట్ సరిగా అమలు లేకపోవడంతో నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు.

# వేలం రెవెన్యూపైనే ఆశలు

## టీజీఐఐసీ భూముల వేలంతో తెరమీదకు హెచ్ఎండీఏ వెంచర్లు

సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలో హాట్ కేకుల్లా అమ్ముడుపోయిన భూములకు ఇప్పుడు డిమాండ్ లేకుండా పోయింది. అన్ని సౌలతులతో డెవలప్ చేసిన ప్లాట్లను కూడా విక్రయించలేకపోతుంది. దీనికి మార్కెట్‌లో నెలకొని ఉన్న సందిగ్ధ పరిస్థితులే కారణం. తాజాగా హైదరాబాద్ కేంద్రంగా ప్రైమ్ ఏరియాల్లో భూములను వేలం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాల భూములను వేలం వేయాలనే ప్రతిపాదనలు తెరమీదకు వచ్చాయి.

### 400 ఎకరాల విస్తీర్ణంలో..

గచ్చిబౌలి కంచలో 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న టీజీఐఐసీ భూములను విక్రయంతో భూముల వేలంపై మరోసారి చర్చ మొదలైంది. ఖజానా నింపుకొనేందుకు కాంగ్రెస్ సర్కారు భూములను విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే రేవంత్ సర్కార్ వేలానికి కసరత్తు ప్రారంభించడంతో హెచ్ఎండీఏ పరిధిలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల వేలం ప్రక్రియలో మళ్లీ కదలిక వచ్చింది.

### చిగురించిన ఆశలు...

బంజారాహిల్స్, బుద్వేల్, వంటి కీలకమైన ప్రాంతాల్లోని వెంచర్లను వేలానికి సిద్ధం చేస్తున్నారు. కానీ మార్కెట్ దారుణంగా ఉండటంతో వేలానికి హెచ్ఎండీఏ ముందుకు రావడం లేదు. అసలే మార్కెట్‌లో ఉన్న ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకుని, ఆచితూచి అడుగులు వేస్తుండగా... టీజీఐఐసీ భూముల వేలంతో హెచ్ఎండీఏకు ఆశలు చిగురించాయి. గతంలో హెచ్ఎండీఏకే భారీ ఆదాయం సమకూరిన నేపథ్యంలో... ప్రస్తుత మార్కెట్ పరిస్థితి ప్రకారం ఆ స్థాయిలో రెవెన్యూ రాకపోయినా కనీసం రూ. 3వేల కోట్లు వచ్చినా... హెచ్ఎండీఏ చేపట్టనున్న ప్రాజెక్టులకు భూసేకరణకు సరిపోతుందనే అంచనాలున్నాయి. ఇదిలా ఉంటే టీజీఐఐసీ ద్వారా నిర్వహించే భూముల వేలం ద్వారా ప్రభుత్వం రూ.25 నుంచి 30 వేల కోట్ల నిధులు సమకూర్చుకోవాలనే అంచనాతో ఉంది. ప్రభుత్వం వేలంపై వచ్చే రెవెన్యూపై పెట్టుకున్న ఆశలతో... హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ స్వరూపం తేలిపోనున్నది.

## శిలాఫలకం వేశారు.. పనులు మరిచారు

ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం.. స్పీకర్, మంత్రి కలిసి వేసిన శిలాఫలకం

వికారాబాద్, మార్చి 9 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి రూ.ఆరు కోట్లు కేటాయించారు. ఆగస్టు 5, 2024న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మా ణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి శిలాఫలకం వేశారు. ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. అందులో రూ.6 కోట్లతో జీ ప్లస్-1 భవ నాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలూ తయారు చేశారు. శిలాఫలకం వేసి దాదాపుగా ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులను ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆ భవనాన్ని త్వరగా పూర్తి చేసిన అం దుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.